క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ శ్రీదేవి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, సినీ డైరెక్టర్ గౌరీ రోణంకి దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపం లో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నేడు అచల మహాసభలు

తిరుపతి కల్చరల్: యోగాచల ధార్మిక సేవా సంఘం జిల్లా శాఖ, నిర్భయానంద మోహనస్వామి సంయుక్తంగా ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఉయదం 4.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అచల మహాసభలు నిర్వహిస్తున్నట్లు అచల మహాసభల ఆహ్వానితులు జగన్‌మోహన్‌రెడ్డి, రమణ, కల్పన తెలిపారు. ఇందులో భాగంగా గురుపూజ, గురుగీతా పారాయణం, జెండా ఆవిష్కరణ, నగర సంకీర్తన, అనంతరం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేట్టాలని తిరుపతి జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రతినిధులు కోరారు. వారు శనివారం ఎస్వీయూ క్యాంపస్ పాఠశాలలో జేడీ సర్వీసెస్, పది పరీక్షల ప్రత్యేక పరిశీలకులు మువ్వా రామలింగంను కలిసి విన్నవించారు. నాయకులు ముత్యాలరెడ్డి, యువశ్రీమురళి, వెంకటముని, వెంకటరమణ, విశ్వనాథ్, నిర్మల, రమేష్ నాయుడు మునిశారద, బండి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

బియ్యం వితరణ



తిరుపతి కల్చరల్: పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్‌లోని అనాథ పిల్లల సంక్షరణ కేంద్రానికి వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం 10 బస్తాల బియ్యం వితరణ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ప్రతినిధులు సుబ్బారెడ్డి, రామమూర్తి యాదవ్, మునికృష్ణారెడ్డి,రామారావు, పాస్ సిబ్బంది మురళి పాల్గొన్నారు.

కృష్ణం నాయుడు కుంటకు పూర్వవైభవం

తిరుపతి తుడా: తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో ఉన్న కృష్ణంనాయుడు కుంటకు పూర్వవైభవం తీసుకువస్తున్నట్టు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం కుంట అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చారిత్రక కట్టడమైన కృష్ణం నాయుడు కుంట కొన్నేళ్లుగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. స్థానికులు చెత్త వేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కృష్ణం నాయుడు కుంట అభివృద్ధికి హామీ ఇచ్చారని, ఇందులో భాగంగానే పనులు చేపట్టామని వెల్లడించారు. తొలి విడతలో రూ.53 లక్షలకు పైగా ఖర్చు చేసి రాతి కట్టడాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. రెండవ విడత పనులను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. దీన్ని ఆహ్లాదకరమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్పొరేటర్ పునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయగిరి రమేష్, బొగ్గుల వెంకటేష్, శ్యామల, అరుణ్ కుమార్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కురబలను ఎస్టీ జాబితాలో చేర్చాలని నిరసనలు

తిరుపతి కల్చరల్: కురబలను ఎస్టీ జాబితాల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ త్వరలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద నాలుగు రోజులు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఏపీ కురబ, కురుమ సంఘం అధ్యక్షుడు జె.శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కురబ, కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే విజయవాడలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

చంద్రబాబుకు రాజకీయ సన్యాసం తప్పదు

- ఏదో ఒక పథకం ద్వారా 87 శాతం మంది ప్రజలకు లబ్ధి
- 'జగనన్నే మా భవిష్యత్తు' అంటున్న ప్రజలు
- ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి



ఇంటికి జగనన్న స్టిక్కర్లు అంటించుకున్న మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి చంద్రబాబు రాజకీయ సన్యాసం తీసుకోకతప్పదని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఆయన శనివారం ఎంపీ గురుమూర్తి, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డితో కలిసి 6వ డివిజన్ కొర్లగుంటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారితో మాట్లాడారు. వారు పొందిన పథకాలు, సమస్యల గురించి ఆరా తీశారు. జగన్, చంద్రబాబు పరిపాలన గురించి అభిప్రాయాలు సేకరించారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలా? వద్దా? అని అడిగి తెలుసుకున్నారు. జగనన్నకు మీరంతా మద్దతుగా ఉంటారా? అని అడిగారు. జగనన్న మీకు మేలు చేశారని భావిస్తే ఇంటికి స్టిక్కర్‌ను అంటించుకోవాలని కోరారు. దీంతో చాలా మంది జగనన్న ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను ఇంటికి అంటించుకున్నారు.

చంద్రబాబుకు రాజకీయ సన్యాసమే గతి

ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని 87 శాతం మంది పేద ప్రజలు ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. అధికారంలోకి రావాలంటే ప్రజలకు మేలు చేసి ఉండాలని, లేదా తాము వస్తే ఏమి చేస్తామో చెప్పాలని సూచించారు. పచ్చ మీడియాలో జగనన్నను దూషించడంతోపాటు బురదజల్లేలా మాట్లాడితే ప్రజలు ఓట్లు వేయరన్న విషయాన్ని గుర్తించాలన్నారు. చంద్రబాబు రాజకీయ సన్యాసం పుచ్చుకోకతప్పదన్నారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ అధికార దాహంతో ప్రతిపక్షాలు చెప్పే కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు దొడ్డారెడ్డి మురళీరెడ్డి, చిమట రమేష్, నారాయణరెడ్డి, నాదముని, బాలాజీ, ప్రభాకర్ రెడ్డి, శీనాయాదవ్, నరేష్‌యాదవ్, ఢిల్లీ, రవి పాల్గొన్నారు. అదేవిధంగా మేయర్ శిరీష, కార్పొరేటర్లు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు.

జగనన్నతోనే జనరంజక పాలన

చంద్రగిరి: సీఎం వైఎస్ జగనన్నతోనే రాష్ట్రంలో జనరంజక పాలన సాధ్యమని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మిట్టపాళెం పంచాయతీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. ప్రజలతో మాట్లాడి వారి సెల్‌ఫోన్ నుంచి సీఎం సెల్ ఫోన్‌కు మిస్డ్‌కాల్ చేయించారు. అనంతరం స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, గృహసారథుల కన్వీనర్ సీఎం కేశవులు, పంచాయతీ అధ్యక్షుడు బోయరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి 44వ డివిజన్‌లో కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ, వార్డు అధ్యక్షులు అశోక్



మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో మేయర్ శిరీష, నాయకులు



తిరుపతి 11వ డివిజన్‌లో కార్పొరేటర్ ప్రవళికారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి



తిరుపతి 16వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి



తిరుపతి 33వ డివిజన్‌లో కార్పొరేటర్ దూదికుమారి, దూది శివరాయల్

భాకరాపేటలో..

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని ప్రతి ఒక్కరూ మా నమ్మకం నువ్వే జగన్ అని అంటున్నారని ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి అన్నారు. ఆయన శనివారం చిన్నగొట్టిగల్లు, భాకరాపేట, టీ.చట్టివారిపాళెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల గృహ సారథుల కన్వీనర్ ఖదీర్ అహ్మద్, డివిజన్ అధ్యక్షుడు అక్బర్, గురుశంకర్, ఉమామహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్

భాకరాపేట: మండలంలోని కోటకాడపల్లి పంచాయతీలో శనివారం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కోటకాడపల్లి సర్పంచ్ రమణ, ఎంపీపీ శివలక్ష్మి, వైస్ ఎంపీపీలు శివలక్ష్మి, రెడ్డెమ్మ, జెడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి, నాయకులు చేంగల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోరకాయలపాలెంలో..

రామచంద్రాపురం: మండలంలోని సొరకాయలపాలెం, వేపకుప్పం, కమ్మపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శనివారం ఎంపీటీసీలు ఎద్దల రాజేష్, కవిత, పీహెచ్‌సీ చైర్మన్ మహేంద్ర రెడ్డి, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సర్పంచి హిమాల్‌రెడ్డి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి స్టిక్కర్లను అంటించారు.

అభివృద్ధి పనులను కొనసాగించండి



తిరుపతి ఎమ్మెల్యే భూమనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా : తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కమిషనర్ హరితకు సూచించారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన హరిత శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థినిగా, తిరుపతి సమస్యలపై అవగాహన వున్న వ్యక్తిగా ప్రజాభివృద్ధికి కృషి చేసి రుణం తీర్చుకోవాలని సూచించారు. అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేసుకుంటూ ముందుకుపోవాలని తెలిపారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చిపై భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవను కనుల పండువగా చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



తిరుపతి తుడా: తిరుపతిలోని డాక్టర్ కిషోర్‌రత్నం స్కూల్స్ గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. సబ్జెక్టుల్లో ఉత్తమ విద్యార్థులుగా నిలిచిన వారికి వార్షిక అవార్డులు ఇచ్చారు. ప్రిన్సిపాల్ పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

టీచ్ టూల్‌తో బోధన మెరుగు

రామచంద్రాపురం: టీచ్ టూల్‌తో ఉపాధ్యాయుల బోధనను మెరుగుపడుతుందని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్ తెలిపారు. ఆయన శనివారం గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనం, లేఖనం , రేఖాగణిత నైపుణ్యాలను అభివృద్ధి పరచాలన్నారు. హెచ్‌ఎం మైథిలీ, మారయ్య, టీచ్ టూల్ పరిశీలకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామనామంతో సకల శుభాలు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాస్ డైరెక్టర్ వి.నాగరాజు

తిరుపతి కల్చరల్: రామనామంతో సకల శుభాలు జరుగుతాయని రాస్ డైరెక్టర్ వి.నాగరాజు తెలిపారు. రాస్ పొదుపు సంఘాల ఆధ్వర్యంలో కొరమేనుగుంటలోని రామాలయంలో శనివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీరాముడు తండ్రి ఆశయాలను, కోరికలను మన్నించి అడవికి వెళ్లిన మానవతా మూర్తి అని కొనియాడారు. ఆయన విధానాలు, మాటకు విలువనివ్వడం, శక్తి ఉన్నా వినమ్రంగా ఉండడం, అడుగులో మంచిని గ్రహించడమే రామాయణ పరమార్థమని తెలిపారు. మహిళలు తమ పిల్లలను బాగా చదివించడంతోపాటు సంస్కారం, సంప్రదాయాలను నేర్పించాలని సూచించారు. అనంతరం నిరుపేదలకు చేతికర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, గీతాంజలి, ఉమామహేశ్వరి, బాలు, దేశమ్మ, కోమల, రాధ పాల్గొన్నారు.

బ్రహ్మర్షి ఆశ్రమంలో ఆల్ ఇండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్ చైర్మన్



రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురం సమీపంలోని బ్రహ్మర్షి ఆశ్రమాన్ని శనివారం ఆల్ ఇండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్ చైర్మన్ మణీందర్‌జీత్ సింగ్ బిట్టా సందర్శించారు. లక్ష్మీనారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

దామలచెరువు రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

పాకాల: పాకాల నుంచి దామలచెరువుకు సుమారు రూ.9 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. రోడ్డుకు అడ్డుగా విద్యుత్ స్తంభాలను తొలగించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు గుంతలమయం కావడంతో గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతిచెందారు. రోడ్డును బాగు చేయించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే చెవిరెడ్డిని కోరారు. స్పందించిన ఆయన రూ.9 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించారు. పాతికేళ్లుగా తీరని ప్రధాన రహదారి సమస్యకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరిష్కరించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నంగా బాబు రెడ్డి, చెన్నకేశవరెడ్డి, శ్రీరాములురెడ్డి, మునీర్, గుండ్లూరి సురేష్, కపిలేశ్వర్‌రెడ్డి, రమేష్, హేమంత్, సునీల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



బాబూ ప్రసాద్‌రెడ్డిని పరామర్శిస్తున్న చెవిరెడ్డి

మాజీ గ్రంథాలయ చైర్మన్‌కు పరామర్శ

పాకాల : అనారోగ్యంతో బాధపడుతున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ బాబూప్రసాద్‌రెడ్డిని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన శనివారం దామలచెరువులోని స్వగృహంలో కలిసి పలకరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడని, మద్దతు తెలపాలని కోరారు.

రాష్ట్రంలో పారదర్శక పరిపాలన

- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- కోటకాడపల్లిలో రూ.1.76 కోట్లతో పనులు
- గడప గడపకూ మహా పాదయాత్రకు అపూర్వ స్పందన



మేదర్లతో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

భాకరాపేట : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం ఎర్రావారిపాలెం మండలంలోని కోటకాడపల్లి పంచాయతీ వీఆర్ కాలనీ, కోటకాడపల్లి, వేములవాడ, చెంగావాండ్లపల్లి, అయ్యగారి పల్లి, తడికల చేనుపల్లి, బుట్టవానికుంట, ఎస్టీ కాలనీలో గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టారు. ఆయనకు మహిళలు హారతి పట్టి ఘన స్వాగతం పలికారు. వారు పొందిన ప్రభుత్వ పథకాలు, లబ్ధిని వివరించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కోటకాడపల్లి పంచాయతీలో రూ.1.76 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సిఫార్సులకు తావులేదన్నారు. అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోటకాడపల్లి సర్పంచ్ రమణ, ఎంపీపీ శివలక్ష్మి, వైస్ ఎంపీపీలు శివలక్ష్మి, రెడ్డెమ్మ, జెడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి, నాయకులు చెంగల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఎంపీడీవో అమరనాథ్, తహసీల్దార్ దస్తగిరయ్య, ఏవో ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పనుల పరిశీలన

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్ నిర్మాణ పనులను శనివారం ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ అనతికాలంలోనే అద్భుతమైన శాశ్వత రాతి కట్టడంతో అమ్మవారి గర్భాలయ పనులను తుది దశగా తీసుకురావడం సంతోషకరమన్నారు. పనుల వేగవంతంలో ఎమ్మెల్యే చూపుతున్న చొరవను, ఆలయ చైర్మన్, ఈవో, ఇతర సిబ్బంది సహకరిస్తున్న తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా లిటిల్ ఏంజెల్స్ వార్షికోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో శనివారం యశోదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ 42వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా మేయర్ శిరీష, ఐఎఫ్ఎస్ సిత్వికల్చరిస్ట్ యశోదబాబు, కార్పొరేటర్ ఎం.శేఖర్ రెడ్డి పాల్గొని వేడుకలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నతికి సోపానమని, ఆ దిశగా ప్రతి విద్యార్థీ ముందుకు సాగాలన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అధినేత కె.రాజగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఎం.రమాదేవి, ప్రిన్సిపాల్ ఎస్.శారాస్మిత పాల్గొన్నారు.

శంకరంబాడికి రంగస్థలి నివాళి

తిరుపతి కల్చరల్: మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీత రచయిత శంకరంబాడి సుందరాచార్యుల వర్ధంతిని రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం జరుపుకున్నారు. లక్ష్మీపురం సర్కిల్లోని శంకరం బాడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, పొన్నాల జేజిరెడ్డి, హరినాథ్, సుబ్రమణ్యంరెడ్డి, గంగయ్య, ధనుంజయరెడ్డి, తిరుపాలాచారి పాల్గొన్నారు.

పాటలు, నాటికలు పంపండి

తిరుపతి కల్చరల్: తెనాలిలో 10, 11, 12 తేదీల్లో నిర్వహించే రచయితలు, కళాకారుల వర్క్‌షాప్‌కు యువ కవులు, రచయితలు, కళాకారులు తమ రచనలు పంపాలని ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య పిలుపునిచ్చారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఇతి వృత్తంగా తీసుకుని సామాన్య, మధ్య తరగతి ప్రజల కష్టాలను వివరిస్తూ పాటలు, నాటికలు, నాటకాలు, స్కిట్స్ రూపంలో రచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వాటిని నేరుగా లేదా వాట్సాప్ ద్వారా 9885228869, 9866288553కు పంపాలని తెలిపారు.

బీజేపీ సమావేశమా... ప్రభుత్వ కార్యక్రమమా?

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కోసం సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రధాని హోదాలో వచ్చిన నరేంద్రమోదీ బీజేపీ సమావేశంగా మార్చి వేయడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. బీజేపీ నేతగా సమావేశానికి వచ్చారా లేక ప్రధానిగా వచ్చారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన శనివారం తిరుపతి సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, వందే భారత్ రైలును ప్రారంభించిన మోదీ బీఆర్ఎస్ పార్టీపై ఆరోపణలు చేయడం రాజ్యాంగ లౌకిక వ్యవస్థకు వ్యతిరేకమన్నారు. మోదీ తీరును ఎండగడుతూ 19 రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయని, ప్రజాక్షేత్రంలో మోదీని ముద్దాయిగా నిలబెడతామని ఆయన స్పష్టం చేశారు.

మే 11 నుంచి తెలుగు తల్లి ఆరాధనోత్సవాలు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో మేనెల 11, 12, 13 తేదీల్లో తెలుగు తల్లి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్టు శ్రీవంశీ కళాక్షేత్రం కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జీఎల్.కుమార్ తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కళారంగంలో విశేష సేవలు అందిస్తున్న వారికి రంగమార్తాండ, సంఘ సేవకులకు కుబేరా అవార్డులు అందజేస్తామన్నారు. వివరాలకు 7893063900, 9966065961లో సంప్రదించాలన్నారు.

బీసీల జనగణనపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి

తిరుపతి కల్చరల్: బీసీల జనగణన చేపట్టడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తోందని ఏపీ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు శౌంఠి నాగరాజు విమర్శించారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా దేశంలోని బీసీ కులాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. దేశంలో జంతవుల లెక్కలు ఉన్నాయని, బీసీ కులాలకు లెక్కలు లేకపోవడం శోచనీయమన్నారు. బీసీలకు జనగణన కులగణన చేయాలనే ప్రధాన డిమాండ్‌తో కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు.